Local News



# అక్టోబర్ 15 వరకు పనులు పూర్తి చేయాలి

- **పంచాయతీ రాజ్ శాఖ అధికారులకు కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆదేశాలు**

**జనగామ, మన చౌరాస్తా :** గ్రామాల అభివృద్ధి కోసం కేటాయించిన 15వ ఆర్థిక సంఘం నిధులను ఉపయోగించి పెండింగ్ పనులను చేపట్టాలని, అక్టోబర్ 15 వరకు అన్ని పనులు పూర్తి చేయాలని జిల్లా పాలనాధికారి, జడ్పీ ప్రత్యేక అధికారి రిజ్వాన్ భాషా ఆదేశించారు. జిల్లా పరిషత్ అభివృద్ధి పనుల ప్రగతిని జడ్పీసీఈవో సరిత ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్‌లో కలిసి కలెక్టర్ సమగ్రంగా సమీక్షించారు. మండల ప్రత్యేక అధికారులు, ఇంజనీరింగ్, ఎంపీడీవో పాల్గొన్న ఈ సమీక్షలో 2022-23, 2023-24 లో చేపట్టిన స్టేట్ ఫైనాన్స్ కమిషన్, సెంట్రల్ ఫైనాన్స్ కమిషన్ల కింద ఎంపీపీ, జడ్పీ గ్రాంట్ కింద మంజూరైన అభివృద్ధి పనులపై సమీక్షించారు. మండల పరిషత్‌ల ద్వారా 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి 762 పనులు మంజూరు కాగా 507 పూర్తయ్యానని, 167 పనులు పెండింగ్‌ల ఉన్నాయని, 84 పనులు వివిధ కారణాలవల్ల ప్రారంభించలేదని అధికారులు వివరించారు. రాష్ట్ర గ్రాంట్ల నుంచి 259 పనులు చేపట్టగా 195 పనులు పూర్తి కాగా, 44 పనులు కొనసాగుతున్నాయని మరో 20 పనులు చేపట్టాల్సి ఉందన్నారు. జనగామ కార్యాలయం నుంచి ఎఫ్ఎఫ్‌సీ నిధులతో 269 పనులు చేపట్టగా 179 పనులు పూర్తి కాగా, 22 పనులు నిర్మాణంలో ఉన్నాయని, 68 పనులు మొదలు పెట్టాల్సిన ఉందన్నారు. జిల్లా పరిషత్ నుంచి రాష్ట్ర నిధుల ద్వారా 136 అభివృద్ధి పనులు చేపట్టగా 105 పనులు పూర్తి కాగా, 9 పనులు నిర్మాణంలో ఉన్నాయని, 22 పనులు చేపట్టలేదన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను అక్టోబర్ 15 నాటికి పూర్తిచేయాలని, ఇంకా ప్రారంభం కాని పనులను వెంటనే చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమీక్షలో జిల్లా పంచాయతీ అధికారి స్వరూప, మండల ప్రత్యేక అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

## పనితీరు మెరుగుపర్చుకోవాలి

**జనగామ, మన చౌరాస్తా :** సర్వే శాఖ పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది పనితీరు మెరుగు పర్చుకోవాలని జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సూచించారు. కలెక్టర్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో సహాయ సంచాలకులు ఆధ్వర్యంలో సంబంధిత సర్వే శాఖ అధికారులు, సిబ్బందితో సర్వే పనులను కలెక్టర్ సమీక్షించారు. సర్వే నంబర్ 486 సర్వే చేయాల్సిన ఉన్నందున పనుల్లో జాప్యం తగదని వేగవంతం చేయాలన్నారు. జువారీ లక్ష్యాలను రూపొందించుకోవాలని అధికారులను దేశించారు. కోర్టు కేసుల వరకు వెళ్లకుండా చేసుకోవాలన్నారు. సర్వే చేపట్టి నిర్దేశించిన గడువు లోగా పూర్తి చేసి నివేదిక ఇవ్వాలన్నారు. జనగామలో పెండింగ్ ఎక్కువగా ఉందన్నారు. అక్టోబర్ 21వ తేదీ లోగా సర్వేలన్నీ పూర్తి చేయాలని, గూగుల్ షీట్ రూపొందించి ఎప్పటికప్పుడు అప్ డేట్ చేయాలన్నారు. టీఎం 33లో ప్రభుత్వ స్థలాలు, కాలువలు, వక్ఫ్ బోర్డ్ , ఆబాది లేగాక ఎఫ్‌టీఎల్ పరిధిలోని చెరువులు, కుంటలు సర్వేచేసి నివేదిక ఇవ్వాలన్నారు. సమీక్ష సమావేశంలో సర్వే ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకులు మన్యం కొండ పాల్గొన్నారు.



# విద్యార్థి మహాగర్జనను విజయవంతం చేయండి

- **ఎస్ఎఫ్ఐ జనగామ జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం**

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** ఈనెల 27న హైదరాబద్‌లో జరిగే విద్యార్థి మహాగర్జన సభను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం కోరారు. శనివారం ఎస్ఎఫ్ఐ బచ్చన్నపేట మండల ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ధర్మ భిక్షం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలన పేరుతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎనిమిది నెలలు గడిచిన రాష్ట్ర విద్య రంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడం లేదన్నారు. హాస్టల్ వసతులు




లేక అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని వాటిని సొంత భవనాలుగా నిర్మించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మేస్ చార్జిలను 3 వేలకు పెంచాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని కోరారు. అధ్యాపకుల కొరతతో తెలంగాణ విద్యారంగం నేడు సంక్షోభంలో ఉందన్నారు. ప్రభుత్వాలు విద్యారంగానికి సరిపడాన్ని నిధులు ఇవ్వడం లేదన్నారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఈనెల 27న హైదరాబాద్ ఇందిరా పార్క్‌లో నిర్వహించే విద్యార్థి మహాగర్జనను జయప్రదం చేయాలని కోరారు.కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకురాలు సుమ, ఆర్యచ, మండల కార్యదర్శి మురళి, నాయకులు దీన, నివేదిక, నిఖిల్, ఆనంద్, చిన్మయి, రేఖ, శ్రీవిద్య, హారిక, కావ్య, స్రవంతి, విజయ్, సందీప్, భాను తదితరులు పాల్గొన్నారు.



## పీసీసీ చీఫ్‌ను కలిసిన ఇందిర

నూతనంగా నియమితులైన పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి సింగపురం ఇందిర శనివారం హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

**- మన చౌరాస్తా, స్టేషన్‌ఘన్‌పూర్**



# వైభవంగా గణేష్ నిమజ్జనం

**రఘునాథపల్లి, మన చౌరాస్తా :** జై బోలో గణేష్ మహరాజ్ కి జై... గణపయ్య అయ్యా వెళ్లి రావయ్యా.. అంటూ భక్తులు గణనాథునికి ఘనంగా వీడ్కోలు పలికారు. మండల కేంద్రంలోని బ్యాంక్ స్ట్రీట్ లో శనివారం సాయంత్రం గణనాథుడి లడ్డు వేలం పాట అత్యధిక రూ.2 లక్షలకు పలకడం జరిగింది. లడ్డును కోళ్ల కోళ్ల రవిగౌడ్ కుమార్తె సాయి దుర్గ దక్కించుకున్నారు. అనంతరం అత్యంత వైభవంగా గణేష్ నిమజ్జనం కొనసాగింది. యువకులు భక్తులు ఉత్సాహంతో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బొల్లం అజయ్ మణికంఠ, గణపతి ఉత్సవ కమిటీ సభ్యులు కోళ్ల రవి గౌడ్, కోళ్ల సాయికుమార్ గౌడ్, బొల్లం రంజిత్, ఆకుల మహేష్, కందుల అనిల్ కుమార్, గూడా కిరణ్ కుమార్, ప్రదీప్, అన్వేష్, రాకేష్, వంశీ, నీకేశ్, రాహుల్ పాల్గొన్నారు.

# రేషనలైజేషన్ జీవోను మార్చాలి

**హైదరాబాద్, మన చౌరాస్తా :** తరగతి ఒక గది, తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండి విద్యార్థులను వారి తల్లిదండ్రులను ప్రభుత్వ పాఠశాలల వైపు ఆకర్షించవలసి ఉండగా అశాస్త్రీయమైన జీవో 25 అమలు చేయాలని పాఠశాల విద్యా సంచాలకులు జిల్లా కలెక్టర్లను ఆదేశించడాన్ని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ తీవ్రంగా ఖండిస్తుంది. ప్రాథమిక పాఠశాలలో 11 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు అదే విధంగా 60 మంది విద్యార్థులకు కూడా ఇద్దరే ఉపాధ్యాయులను కేటాయించాలని పేర్కొనడం అసంబద్ధమైన విషయం. ఇటీవల జరిగిన సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల బదిలీలలో పాఠశాల విద్యా శాఖ పాటించిన నిబంధనలను కూడా అమలు చేయడకపోవడం పట్ల యూఎస్పీసీ ఆందోళన వ్యక్తం చేసింది. ప్రతి ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులుండే విధంగా, 40 మంది వరకు ఇద్దరు, 60 మంది వరకు ముగ్గురు, ప్రతి 20 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుని చొప్పున కేటాయించాలని, ప్రతి ప్రాథమిక పాఠశాల కు ప్రధానోపాయుడిని నియమించి ఉపాధ్యాయులను భోదనేతర పనుల నుంచి మినహాయించాలని యూఎస్పీసీ కోరుతుంది. నేటి సామాజిక పరిస్థితులను పరిగణలోనికి తీసుకొని ఉన్నత పాఠశాలలో ప్రతి 25 మంది విద్యార్థులకు ఒక సెక్షన్‌గా పరిగణించి ప్రభుత్వ ఉత్తర్వులు 25 ను సవరించాలని డిమాండ్ చేశారు. డియస్సీ నియామకాలు జరగాల్సిన సమయంలో సర్దుబాటు ఉత్తర్వులు ఇవ్వటాన్ని బట్టి నియామకాలు ఇప్పట్లో చేసే ఉద్దేశం లేదా అనే అనుమానం కలుగుతోందన్నారు. ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ ద్వారానైన బదిలీ అయిన ఎస్.జి.టి. ఉపాధ్యాయులందరినీ రిలీవ్ చేయాలని కోరారు.